సాక్షి
విశాఖపట్నం
శనివారం । 9 । నవంబర్ । 2024



### పరిశుభ్రతతో ఆరోగ్యం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య కార్మికులను, వైద్య ఆరోగ్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. 8లో

### ఉత్కంఠగా మాక్‌డ్రిల్





విశాఖపట్నం విమానాశ్రయంలో విమానం హైజాక్, సింహాచలం రైల్వే స్టేషన్‌లో రైలు ప్రమాద మాక్‌డ్రిల్‌లు ఉత్కంఠగా సాగాయి. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది, ప్రజలు ఎలా ప్రతిస్పందించాలనే దానిపై స్పష్టమైన అవగాహనను కల్పించారు. 8లో

## న్యూస్‌రీల్

### ముగిసిన 'అండమాన్' ఎయిర్ మార్షల్ పర్యటన



ఈఎన్‌సీ చీఫ్‌తో అండమాన్ కమాండర్-ఇన్-చీఫ్ ఎయిర్‌మార్షల్ సాజు బాలకృష్ణన్

విశాఖ సిటీ: అండమాన్-నికోబార్ **కమాండ్** కమాండర్-ఇన్-చీఫ్ ఎయిర్ మార్షల్ **సాజు** బాలకృష్ణన్ మూడు రోజుల విశాఖ **పర్యటన** శుక్రవారంతో ముగిసింది. తూర్పు **నౌకాదళం** ప్రధాన కార్యాలయం సందర్శనలో భాగంగా ఆయన ఈ నెల 5న డిఫెన్స్ వైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్(డీడబ్ల్యూడబ్ల్యూఏ) ప్రాంతీయ అధ్యక్షురాలు లతా సాజుతో కలిసి విశాఖకు వచ్చారు. ఈ పర్యటనలో ఆయన తూర్పు నావికాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్‌తో సమావేశమయ్యారు. ఇరు కమాండ్ల సమన్వయం, సహకారంపైనే కాకుండా తూర్పు సముద్రతీరం వెంబడి భారత నావికాదళం బాధ్యతలు, కార్యాచరణ కార్యకలాపాలపై చర్చించారు. అనంతరం సాజు బాలకృష్ణన్ జలాంతర్గామితో పాటు నేవల్ డాక్‌యార్డ్, ఏకశిలా, ఇతర కీలక నౌకాదళ విభాగాలను సందర్శించారు. శుక్రవారంతో ఆయన పర్యటన ముగిసింది.

### 8 మంది పోలీస్ సిబ్బందికి పదోన్నతులు



పదోన్నతులు పొందిన సిబ్బందితో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో 8 మంది సివిల్, ఏఆర్ సిబ్బందికి పదోన్నతులు లభించాయి. ముగ్గురు సివిల్ కానిస్టేబుళ్లను హెడ్ కానిస్టేబుళ్లుగా, ఇద్దరు ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లను ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుళ్లుగా, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా, ఒక ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్‌ను ఏఆర్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. వీరిని శుక్రవారం కుటుంబ సభ్యులతో సహా నగర పోలీస్ సమావేశ మందిరానికి ఆహ్వానించి.. పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సత్కరించారు. పదోన్నతి ర్యాంకులతో పాటు పోస్టింగ్ ఆర్డర్‌లు అందజేశారు.

### ఏయూకు దివీస్ రూ.1.98 కోట్ల విరాళం

వర్సిటీలో 70 ఆర్వో వాటర్ ప్లాంట్ల ఏర్పాటు



నిధులు మంజూరు పత్రాన్ని ఏయూ వీసీకి అందిస్తున్న దివీస్ మేనేజర్ సురేష్ కుమార్

విశాఖ సిటీ: ఏయూలో 70 ఆర్వో వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు దివీస్ లేబొరేటరీ ముందుకొచ్చింది. ఈ మేరకు నిధుల మంజూరు పత్రాన్ని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుకు శుక్రవారం దివీస్ సీఎస్సార్ విభాగం సీనియర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ అందించారు. అధికారులు సూచించిన ప్రాంతాల్లో ఈ ప్లాంట్ల నిర్మాణం చేపడతామన్నారు. దివీస్ చైర్మన్ మురళి దివీస్‌కు వర్సిటీ తరఫున వీసీ కృతజ్ఞతలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఏయూ రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ కె.బసవయ్య, దివీస్ జీఎం వై.ఎస్.కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య ఎం.వి.ఆర్ రాజు పాల్గొన్నారు.

# ప్రైవేట్ వెనుక పెద్ద స్కెచ్?



పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్

## విశాఖ పోర్టు ఆస్పత్రి భూములపై కన్ను!

- పోర్టు ఉద్యోగులకు దూరం కానున్న గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ సేవలు
- గాల్లో 40 వేల మంది విశాఖ పోర్టు ఉద్యోగుల ఆరోగ్య భద్రత
- నేడు టెండర్లు ఖరారు చేయనున్న వీపీఏ
- 40 రోజులుగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని యాజమాన్యం
- ఆ ఆరు ఎకరాల్ని కట్టబెట్టేందుకే అడ్డగోలు పన్నాగం

**ఒకే ఒక్క నిర్ణయంతో 40 ఏళ్ల చరిత్ర మరుగున పడిపోనుంది. 40 రోజుల పోరాటం వృథా కానుంది. 40 వేల మంది కార్మిక, ఉద్యోగుల కుటుంబాల ఆరోగ్య భద్రతపై నీలినీడలు కమ్ముకోనున్నాయి. మొత్తంగా పోర్టుపై ఉన్న విశ్వాసం ప్రైవేటుపరం కానుంది. దశాబ్దాలుగా నమ్ముకున్న ఆస్పత్రిలో వైద్యం ఖరీదుగా మారబోతోంది. కేవలం ఆస్పత్రి ఆధునికీకరణ అంటూ విశాఖ పోర్టు అధికారులు సర్దిచెబుతున్నా.. దాని వెనుక భారీ స్కెచ్ కనిపిస్తోంది. ఆస్పత్రి పరిధిలోని రూ.వందల కోట్ల విలువైన భూమిని అప్పనంగా కట్టబెట్టేందుకు కొందరు అధికారులు కుట్రపన్నుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.** – సాక్షి, విశాఖపట్నం

విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) పోర్టులో పని చేసే కార్మికులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వైద్య సేవలందించేందుకు 1984లో సాలిగ్రామపురంలో మొత్తం 150 పడకలతో గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ని నిర్మించింది. కొన్ని గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుతం 80 పడకలకు కుదించారు. మొత్తం 6 ఎకరాల విస్తీర్ణంలో ఆస్పత్రి ఉంది. ఇందులో 1.21 ఎకరాల్లో 5 అంతస్తుల భవనాన్ని ఆస్పత్రి కోసం నిర్మించారు. ఈఎన్‌టీ, డెంటల్, న్యూరాలజీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో, నెఫ్రాలజీ, అంకాలజీ, గైనిక్, పల్మనాలజీ, కంటి, స్పైన్ సర్జన్ విభాగాలతో పాటు హోమియోపతి, ఆయుర్వేదిక్ వైద్య సేవలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. పోర్టులో పనిచేసే 4 వేల మంది ఉద్యోగులతో పాటు కార్మికులు, కుటుంబ సభ్యులు, పూల్ కలాసీలు, సీహెచ్‌డీ క్యాజువల్ కార్మికులు, సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు, పింఛనుదారులు కలిపి మొత్తం సుమారు 40 వేల మందికి ఇక్కడ వైద్య సేవలు అందుతున్నాయి. వైద్య సేవల కోసం పోర్టు అథారిటీ ప్రత్యేకంగా ఎంప్లాయీస్ హెల్త్‌కార్డులు మంజూరు చేస్తోంది. ఇంతవరకూ బాగానే ఉన్నా.. దీన్ని ప్రైవేట్‌పరం చేసేందుకు పోర్టు యాజమాన్యం సిద్ధమైంది.



పోర్టు వద్ద ధర్నా చేస్తున్న జేఏసీ

**విస్తరణ పేరుతో ప్రలోభాలు**

ఆస్పత్రిని ప్రైవేటు సంస్థలకు పీపీపీ విధానంలో అప్పగించేందుకు వీపీఏ అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం టెండర్లు ఆహ్వానించారు. శనివారం టెండర్లు ఖరారు చేసేందుకు కూడా సిద్ధమవుతున్నారు. 150 పడకల ఆస్పత్రిని 300 పడకలకు విస్తరిస్తామంటూ ప్రలోభపెట్టి.. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఆస్పత్రిని పెట్టేందుకు చకచకా పావులు కదుపుతున్నారు. ఇందుకోసం రూ.224.43 కోట్ల వ్యయంతో ఆస్పత్రిని ఆధునికీకరిస్తున్నామంటూ అధికారులు చెబుతున్నారు.

### దూరం కానున్న వైద్య సేవలు

ప్రైవేట్ పరం చేస్తే.. పోర్టు ఉద్యోగులు, కార్మికులు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత దూరం కానుంది. ప్రైవేట్‌కు ఆస్పత్రిని అప్పగించొద్దంటూ.. విశాఖపట్నం పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో 40 రోజులుగా గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి ఆవరణలోనూ, పోర్టు అధికారుల కార్యాలయాల వద్ద ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తూ.. తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. అయినా యాజమాన్యం స్పందించకుండా.. ప్రైవేట్‌కు అప్పగించేందుకే నిర్ణయించడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రతి ఆర్థిక సంవత్సరం పోర్టుకు రూ.వందల కోట్ల ఆదాయం వచ్చి చేరుతున్నా.. ప్రైవేట్‌కు అప్పగించడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగ, కార్మికుల కుటుంబాల ఆరోగ్య సేవలకు ధోకా ఉండదని చెబుతున్నా.. ప్రైవేట్‌పరం చేసిన తర్వాత కోతలు మొదలుపెట్టి.. సేవలను పూర్తిగా దూరం చేస్తారనే ఆందోళన అందరిలోనూ కలుగుతోంది.

### ఆ ఆరు ఎకరాల కోసమేనా.?

వాస్తవానికి ఈ ప్రైవేటీకరణ వెనుక పెద్ద స్కెచ్ ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ చుట్టూ మొత్తం 6 ఎకరాలు పోర్టుకు సంబంధించిన భూములున్నాయి. ఈ భూముల విలువ ప్రస్తుతం అక్కడి మార్కెట్ ధరల ప్రకారం దాదాపు రూ.350 కోట్ల వరకు ఉంటుంది. మొత్తం ఆరు ఎకరాలను ప్రైవేట్ సంస్థకు ధారాదత్తం చేసేందుకు పోర్టుకు చెందిన ఇద్దరు అధికారులు కుయుక్తులు పన్నుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రి పేరుతో మొత్తం కట్టబెట్టేసేందుకు కుట్ర జరుగుతోందని కార్మిక సంఘాలు సైతం ఆరోపిస్తున్నాయి. ఈ డీల్ వెనుక కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయని.. పరిపాలన విభాగంలోని ఓ కీలక ఉద్యోగితో పాటు ఆస్పత్రిలోని ఓ ఉద్యోగి కలిపి చక్రం తిప్పుతున్నారని పోర్టు వర్గాలు భావిస్తున్నాయి.

### కాగ్ మొట్టికాయలు వేసినా బుద్ధి రాలేదు



పోర్టుల్లో పీపీపీ, బీవోటీ విధానాలు విఫలమయ్యాయి. ఈ విషయంలో కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) మొట్టికాయలు వేసినా.. విశాఖపోర్టు అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఇప్పటికే ఎన్నో పోర్టు స్థలాలు, భవనాలను ప్రైవేట్ పరం చేసి.. ఉద్యోగులకు, కార్మికులకు సేవలను దూరం చేశారు. ఇప్పుడు ఆస్పత్రిని కూడా దూరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. ఏటా రూ.350 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది కదా. పోర్టే దీన్ని స్వయంగా అభివృద్ధి చేసేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ప్రైవేట్‌కి అప్పగించడం వెనుక పెద్ద కుట్ర దాగుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హైకోర్టు కూడా కార్మికుల, ఉద్యోగుల అభిప్రాయాలను తీసుకోవాలని చెప్పినా.. యాజమాన్యం పెడచెవిన పెడుతోంది.

– కె.సత్యనారాయణ, ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి

### ఆరోగ్యం కోసం ఆస్తులు అమ్ముకోవాలా.?



పోర్టు ఆస్పత్రిని కాపాడుకునేందుకు 40 రోజులుగా కుటుంబాలతో పోరాటం చేస్తున్నా యాజమాన్యానికి చీమకుట్టినట్లయినా చలనం లేదు. పోర్టు భూములు ప్రైవేట్ చేతుల్లో ఒక్కసారి పడితే.. తిరిగి పోర్టు చేతుల్లోకి వచ్చే అవకాశమే లేదని గత అనుభవాలు చెబుతున్నా.. ఈ తరహా నిర్ణయం తీసుకోవడం సరికాదు. పీపీపీకి ఇస్తే ఉద్యోగులు, కార్మికులపై మోయలేని భారం పడుతుంది. ఆరోగ్యం కోసం ఆస్తులను అమ్ముకోవాల్సి వస్తుంది. ఉద్యోగులు, కార్మికులు పొందే వైద్యాన్ని కూడా లాభనష్టాలు బేరీజు వేయడం దుర్మార్గమైన చర్య. సొంత నిధులతో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేసి స్పెషలిస్ట్ డాక్టర్లను, ల్యాబ్ మిషనరీలను, నాణ్యమైన మందులను అందుబాటులోకి తీసుకురావాలి.

– బి.జగన్, సీఐటీయూ కార్యదర్శి

### హార్బర్ ఏసీపీగా కాళిదాసు

- ఎస్‌బీ ఏసీపీగా చిట్టిబాబు
- క్రైం ఏసీపీగా లక్ష్మణరావు

విశాఖ సిటీ: విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హార్బర్ ఏసీపీగా ఎస్.కాళిదాసు నియమితులయ్యారు. ఈ మేరకు డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాళిదాసు ప్రస్తుతం కోస్టల్ సెక్యూరిటీ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్నారు. అక్కడి నుంచి బదిలీ చేసి ఖాళీగా ఉన్న హార్బర్ ఏసీపీగా నియమించారు. అలాగే విజయనగరం జిల్లాలో ఎస్‌డీపీవోగా ఉన్న ఐ.చిట్టిబాబును ఖాళీగా ఉన్న సిటీ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా, ఇంటెలిజెన్స్ డీఎస్పీగా ఉన్న డి.లక్ష్మణరావును నగర క్రైం ఏసీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### 12న కనకమహాలక్ష్మి మార్గశిరమాస రాట మహోత్సవం

డాబాగార్డెన్స్: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి ఆలయంలో డిసెంబర్ 2 నుంచి 30వ తేదీ వరకు మార్గశిర మాసోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. ఉత్సవాలకు శుభారంభ సూచికగా ఈ నెల 12న 'రాట మహోత్సవం' నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏటా కార్తీక శుద్ధ ఏకాదశి రోజున రాట వేసి.. మార్గశిర మాసోత్సవాలకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా వస్తోందని ఈవో చెప్పారు.



# తప్పుల తడక.. తేలని ప్రమోషన్ల లెక్క

విశాఖ విద్య: మున్సిపల్ టీచర్ల ప్రమోషన్ల ప్రక్రియ సజావుగా సాగడం లేదు. షెడ్యూల్ మేరకు శుక్రవారం అర్హులైన ఎస్జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించి.. స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాల్సి ఉంది. కానీ సీనియార్టీ జాబితాల తయారీలో జరిగిన తీవ్ర జాప్యం, రోస్టర్ పాయింట్ల వ్యవహారం తేలకపోవడంతో కౌన్సెలింగ్ వాయిదా వేయక తప్పలేదు. ప్రమోషన్ వస్తుందని ఆశించిన ఉపాధ్యాయులు మధ్యాహ్నం డీఈవో కార్యాలయానికి చేరుకున్నారు. కానీ పొద్దు పోయాక కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్లు చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు. విద్యాశాఖలో విలీనం చేసుకునే సమయంలో మున్సిపల్ టీచర్లకు సంబంధించిన సర్వీసు పరమైన రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలన చేయకుండా, కలిపేసుకోవడంతోనే ఇప్పుడు సమస్య జటిలంగా మారింది. గత అధికారుల అవగాహన లేమి కారణంగా మున్సిపల్ టీచర్ల ప్రమోషన్ ప్రక్రియ అంతా ఓ ప్రహసనంగా సాగుతోంది.

**అంతా అస్తవ్యస్తం**

మున్సిపల్ టీచర్ల సీనియార్టీ జాబితాల తయారీ అంతా తప్పుల తడకగా ఉందని ఉపాధ్యాయ సంఘాలు సైతం ఆరోపిస్తున్నాయి. విద్యాశాఖలో విలీనమైన తర్వాత మున్సిపల్ టీచర్లకు సంబంధించి క్యాడర్ స్ట్రెంగ్త్‌ను ధ్రువీకరించాలి. కానీ ఈ లోగానే 610 జీవో బదిలీల్లో భాగంగా ఇతర జిల్లాల నుంచి జీవీఎంసీకి కొంత మంది బదిలీపై వచ్చారు. ఎయిడెడ్ స్కూళ్ల విలీనం సమయంలో ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా అల్లూరి, అనకాపల్లి జిల్లాలకు పంపించాల్సి ఉన్నప్పటికీ.. కొంతమందికి మాత్రం జీవీఎంసీలోనే పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందులో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారాయనే ప్రచారం అప్పట్లో సాగింది. మున్సిపల్ స్కూళ్లలో ఇలా వచ్చి చేరిన ఉపాధ్యాయులను కలుపుకుని.. క్యాడర్ స్ట్రెంగ్త్ ఫిక్సేషన్, రోస్టర్ పాయింట్ల కూర్పును చేయాలి. కానీ ఈ విషయంలో డీఈవో కార్యాలయ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి కారణాలతోనే ప్రస్తుతం ప్రమోషన్ల ప్రక్రియ ముందుకు సాగడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రమోషన్ కౌన్సెలింగ్ కోసం వచ్చిన మున్సిపల్ టీచర్లు

**ఇప్పటివరకు 10 పోస్టులే భర్తీ**

జీవీఎంసీ పరిధిలోకి వచ్చే విశాఖ, అనకాపల్లి జిల్లాలో 109 ఖాళీలు ఉన్నట్లు లెక్క తీశారు. ఇందులో 42 పోస్టులు స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌కు చెందినవి. వీటిలో 70 శాతం పోస్టులు ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలి. కానీ శుక్రవారం నాటికి ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం-5, ఫిజికల్ సైన్స్-5 పోస్టుల భర్తీకి మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేశారు. సోషల్ పోస్ట్ దివ్యాంగుడికి రిజర్వ్ కావడంతో.. దాన్ని అర్హత కలిగిన ఉపాధ్యాయుడు తిరస్కరించినట్లు తెలుస్తోంది. లాంగ్వేజ్ పండిట్-7 పోస్టులు ఖాళీలు చూపించినా, కోర్టు వివాదాల నేపథ్యంలో అధికారులు వాటి గురించి స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో అంతా కలిపి 10 పోస్టుల భర్తీ కోసమే వారం పదిరోజులుగా డీఈవో కార్యాలయ అధికారులు కుస్తీలు పడుతుండటం చర్చనీయాంశమైంది.

### పారదర్శకత కోసమే ఆలస్యం



మున్సిపల్ టీచర్లకు సంబంధించిన సర్వీసు పరమైన రికార్డులు, అర్హతా పత్రాలను పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతనే ప్రమోషన్లు ఇస్తాం. ఇందులో ఎలాంటి రాజీ లేదు. ఒక రోజు ఆలస్యమైన పారదర్శకంగా ప్రమోషన్ల కౌన్సెలింగ్ నిర్వహిస్తాం.

– ప్రేమ్‌కుమార్, డీఈవో

### నేటి నుంచి రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ క్రీడా పోటీలు

అగనంపూడి: కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) నెట్‌బాల్ రాష్ట్రస్థాయి అండర్-14 క్రీడా పోటీలు ప్రారంభం కానున్నాయి. 13 ఉమ్మడి జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు మొత్తం 400 మంది క్రీడా ప్రాంగణానికి చేరుకున్నారు. శనివారం ఉదయం నుంచి జట్ల మధ్య పోటీలు జరగనున్నాయి. వీరందరికీ సరిపడా వసతి, భోజన ఏర్పాట్లు చేసినట్టు పాఠశాల హెచ్ఎం సూర్యప్రకాశరావు, ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, నారాయణరావు తెలిపారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.దేముడు, సౌత్ ట్రాఫిక్ సీఐ కిల్లి వెంకటరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



# స్థాయీ సంఘంలో లుకలుకలు

- టీడీపీ కార్పొరేటర్లలో అసమ్మతి
- కొన్ని వార్డులకే ఎక్కువ బడ్జెట్ కేటాయించడంపై మిగతా సభ్యుల ఆగ్రహం



స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘంలో లుకలుకలు మొదలయ్యాయి. సభ్యులందరూ టీడీపీకి చెందిన వారే అయినప్పటికీ.. ఒకరిపై ఒకరు కారాలు, మిరియాలు నూరుకుంటున్నారు. ఇద్దరు, ముగ్గురు కార్పొరేటర్లకు సంబంధించిన వార్డులకే రూ.కోట్లు కేటాయిస్తూ మిగిలిన వారికి మొండిచేయి చూపిస్తున్నారని మండిపడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వార్డుల్లో సమానంగా రూ.కోట్ల విలువైన పనులు జరిగాయని, ఇప్పుడు కూటమి అధికారంలో ఉన్నప్పటికీ తమ వార్డుల అభివృద్ధికి పైసా కూడా విదిల్చడం లేదని ఆక్షేపిస్తున్నారు. అజెండాలో చేర్చిన అంశాల్లో 80 నుంచి 90 శాతం ఇద్దరు, ముగ్గురికి సంబంధించిన పనులే ఉంటుండటాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు.

**మా వార్డుల్లో అభివృద్ధి జరగకూడదా?**

స్థాయీ సంఘంలో 10 మంది సభ్యులూ టీడీపీ వారే. అయినప్పటికీ వారిలో వారికే పడట్లేదు. కొంత మంది సభ్యులు తమ వార్డులకు చెందిన పనులను అజెండాలో చేర్చాలని అధికారులకు మొరపెట్టుకున్నా.. అవి అజెండాలో కనిపించడం లేదు. స్టాండింగ్ కమిటీలో లేని, ప్రస్తుతం జీవీఎంసీలో చక్రం తిప్పుతున్న ఇద్దరు, ముగ్గురు కార్పొరేటర్ల వార్డులకు సంబంధించిన అంశాలను మాత్రం ఆగమేఘాల మీద అజెండాలో పొందుపరుస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో జీవీఎంసీ స్థాయీ సంఘానికి మేము పనికిరామా? మా వార్డుల్లో అభివృద్ధి పనులు జరగకూడదా? అని శుక్రవారం నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశంలో కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థాయీ సంఘ సభ్యులుగా ఎన్నికైన తర్వాత ఐదు సమావేశాలు జరిగాయని, ఇప్పటి వరకు తమ వార్డుల్లో అభివృద్ధికి అతీ గతీ లేదని మండిపడ్డారు. అధికారులే కాదు.. స్థాయీ సంఘం సభ్యులు కూడా ఆ కార్పొరేటర్లకు భయపడుతున్నారంటూ ఆవేశపూరితంగా ఓ కార్పొరేటర్ మాట్లాడారు. స్థాయీ సంఘ సమావేశాల్లో ఏ వార్డుకు ఎన్ని కోట్ల మేర పనులకు ఆమోదం తెలిపారో వచ్చే సమావేశం నాటికి చెప్పాలని సభ్యుడు గల్లా పోలిపల్లి అధికారులను కోరారు. స్థానిక కార్పొరేటర్‌కు తెలియకుండా కొన్ని పనులు అజెండాలో వచ్చేస్తున్నాయని పిసిని వరహా లక్ష్మీ నరసింహం, బల్ల శ్రీనివాసరావు, బొమ్మిడి రమణ, విల్లూరి భాస్కరరావు అన్నారు.

### అభివృద్ధి పనులకు ఆమోదం

మేయర్, స్థాయి చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరిగిన స్థాయీ సంఘ సమావేశంలో 60 అంశాలు ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ స్థాయీ సంఘ సమావేశంలో 71 అంశాలు పొందుపరిచారని, వాటిలో 11 అంశాలు వాయిదా వేసినట్లు తెలిపారు. ఆమోదించిన వాటిలో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రూ.17.50 కోట్ల అభివృద్ధి పనులు, మిగిలినవి రెవెన్యూ, ఉద్యోగుల సర్వీసులకు సంబంధించి అంశాలన్నారు. జీవీఎంసీ కార్యదర్శి బీవీ రమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, జోన్-6 జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, కార్యనిర్వాహక ఇంజినీర్లు పాల్గొన్నారు.

## విమానం హైజాక్!

- విమానాశ్రయంలో మోహరించిన భద్రతా బలగాలు
- విమానాన్ని చుట్టుముట్టి ఆపరేషన్


డ్రిల్‌లో పాల్గొన్న భద్రతా బలగాలు

**విశాఖ సిటీ:** విశాఖ విమానాశ్రయంలో ఒక్కసారిగా భద్రతా బలగాలు మోహరించాయి. ఎన్‌ఎస్‌జీ కమాండోలు, సీఐఎస్‌ఎఫ్ అధికారులు ఆయుధాలతో రన్‌వేపై పరుగులు తీసి.. ఒక విమానాన్ని చుట్టుముట్టారు. అందరిలోనూ ఒకటే టెన్షన్. ఏం జరుగుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. కొంత సేపటికి అది ఒక డ్రిల్‌గా తెలుసుకుని అందరూ ఊపిరిపీల్చుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో యాంటీ హైజాక్ ప్రదర్శన నిర్వహించారు. విమానం హైజాక్ అయితే తలెత్తే పరిస్థితులు, భద్రతా బలగాలు చేసే సాహసాలు, ముష్కరుల నుంచి ప్రయాణికుల విముక్తి, ఇలా అన్ని అంశాలను యథాతథంగా విన్యాసాలు చేశారు. విమానాశ్రయంలో ఆకస్మిక ప్రణాళిక, హైజాక్ సమయంలో పరిస్థితుల అంచనా, ప్రయాణికుల భద్రత, కేంద్ర, రాష్ట్ర బలగాలు, శాఖల మధ్య సమన్వయంపై ప్రదర్శన చేపట్టారు. ఐఎన్‌ఎస్ డేగా, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్), నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్‌ఎస్‌జీ), ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీలు ఇందులో పాల్గొన్నాయి. హైజాక్ సమయంలో అప్రమత్తత, సంసిద్ధత, అత్యవసర ఆపరేషన్ నిర్వహణ, శాఖల మధ్య సమన్వయానికి ఈ ప్రదర్శన దోహదం చేస్తుందని ఐఎన్‌ఎస్ డేగా అధికారులు పేర్కొన్నారు. నేషనల్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ప్రోగ్రాం కింద ఈ వార్షిక డ్రిల్‌ను నిర్వహించారు.


యాంటీ హైజాక్ ప్రదర్శనకు సిద్ధమవుతున్న సీఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌జీ కమాండోలు

## పట్టాలు తప్పిన బోగీలు!

**విశాఖ విద్య:** తిరుపతి– సంబల్‌పూర్ యాత్రిక స్పెషల్ రైలు సింహాచలం రైల్వే స్టేషన్‌కు మరి కొద్ది క్షణాల్లో చేరనుంది. హఠాత్తుగా ఏం జరిగిందో తెలియదు. అంతా గందరగోళం. దడ దడ ధ్వనులతో మూడు బోగీలు పట్టాలు తప్పాయి. ప్రయాణికుల హాహాకారాలు. రైల్వే రక్షణ బృందం, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల రంగప్రవేశం. సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. క్షతగాత్రులకు ప్రథమ చికిత్సలు చేశారు. తీవ్రంగా గాయపడ్డ 25 మంది ప్రయాణికులను వెంటనే స్ట్రెక్చర్లపై మోసుకుని అంబులెన్స్‌ల్లో చేర్చి నగరంలోని ఆస్పత్రులకు తరలించారు.. ఏంటీ.. ఇంత జరిగినా మాకు తెలియలేదే అని కంగారు పడొద్దు. ఇదంతా వాల్తేరు డివిజన్ అధికారులు సింహాచలం(గోపాలపట్నం) స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన మాక్‌డ్రిల్. రైలు ప్రమాదాలు సంభవించినపుడు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు, ప్రయాణికులను అప్రమత్తం చేయడంపై అవగాహన కల్పించేందుకు ఈ మాక్ డ్రిల్‌ను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వాల్తేరు రైల్వే డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ అనుకోని రీతిలో రైలు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రయాణికులను ఎలా కాపాడాలనేదానిపై ఇలాంటి మాక్‌డ్రిళ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మాక్ డ్రిల్‌తో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముందుకొచ్చిన సంబంధిత శాఖల అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.


క్షతగాత్రుడిని రక్షిస్తున్న రైల్వే భద్రత బృందాలు


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న బృందాలు

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

- కలెక్టర్ హరేందిర ప్రసాద్


అక్షయపాత్ర భోజనశాలలో కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

**కంచరపాలెం:** ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య కార్మికులను, వైద్య ఆరోగ్య సిబ్బందిని, అధికారులను కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కంచరపాలెం పాత ఐటీఐ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, ఇతర అధికారులతో కలిసి కాలనీలోని పలు నివాసాలను సందర్శించారు. స్థానికులతో మాట్లాడారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పాత ఐటీఐ జంక్షన్‌లోని అక్షయపాత్ర భోజనశాల, భవానీ గార్డెన్స్ యూపీహెచ్‌సీలను కలెక్టర్ సందర్శించారు. అక్షయపాత్ర మధ్యాహ్న భోజన తయారీ కేంద్రంలో సరకుల నాణ్యతను పరిశీలించారు. వాడిపోయి ఉన్న క్యారెట్, బంగాళదుంపలను చూసి నిర్వాహకులపై మండిపడ్డారు. వాటిని తక్షణమే మార్చాలని, కూరల తయారీలో వినియోగించవద్దని ఆదేశించారు. ఊర్వశి కూడలిలోని అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. చిన్నారులతో ముచ్చటించారు. కలెక్టర్ వెంట డీఈవో ప్రేమ్‌కుమార్, జోన్–5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, వైద్యాధికారులు, జీవీఎంసీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బయో సీఎన్‌జీ ప్లాంట్ అభివృద్ధికి ప్రణాళికలు

- జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్


కాపులుప్పాడ డంపింగ్ యార్డులో కమిషనర్

**మధురవాడ:** జీవీఎంసీ మధురవాడ జోన్ కాపులుప్పాడ డంపింగ్ యార్డులో బయో సీఎన్‌జీ ప్లాంట్‌ను మరింత అభివృద్ధి పరిచేందుకు వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన డంపింగ్ యార్డును పరిశీలించి అధికారులకు, వివిధ సంస్థల నిర్వాహకులకు సూచనలిచ్చారు. బయో సీఎన్‌జీ ప్లాంట్‌ని సందర్శించి బయోగ్యాస్ ఉత్పత్తి, ఇతర అంశాలపై వైజాగ్ బయో ఎనర్జీ ఫ్యూయల్ ప్రై.లి. నిర్వాహకులు కేఎస్ రాజును ఆరా తీశారు. క్లాప్ వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించిన వ్యర్థాలు పేరుకుపోవడంపై ఏఎంహెచ్‌వో కిషోర్‌ను ప్రశ్నించారు. వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు జిందాల్ ప్లాంట్‌కు తరలించేలా ర్యాంప్ నిర్మాణం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ర్యాగ్ పిక్కర్స్‌ను గమనించి చేతులకు గ్లౌస్, కాళ్లకు బూట్లు తప్పనిసరిగా ధరించాలన్నారు. బయోమైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించి, ఫొటోలు తీసి, ఆ ప్రాంతం విస్తీర్ణం తదితర వివరాలతో నివేదికను సమర్పించాలని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రామకృష్ణకు తెలిపారు. ఆయన వెంట జెడ్సీ సింహాచలం, సహాయ కమిషనర్ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, అప్పారావులు పాల్గొన్నారు.

## కలప హ్యాండ్లింగ్‌లో గంగవరం పోర్టు రికార్డ్

**పెదగంట్యాడ:** అదానీ గంగవరం పోర్టు కలప లాగ్ హ్యాండ్లింగ్‌లో రికార్డు సృష్టించింది. ఒకే రోజులో 4,392, 4,206 మెట్రిక్ టన్నుల కలప లాగ్‌లను విజయవంతంగా హ్యాండ్లింగ్ చేసి.. కొత్త మైలురాయిని నెలకొల్పింది. గతంలో మంగుపా్ పోర్టు సాధించిన 2,900 మెట్రిక్ టన్నుల రికార్డును ఈ పోర్టు అధిగమించింది. ఈ విజయంపై పోర్టు అధికారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# అత్తింటి వేధింపులతో కోడలి ఆత్మహత్య?

**గతేడాది వరకు ఆమె సాఫ్ట్‌వేర్ కంపెనీలో హెచ్‌ఆర్ ఉద్యోగి. ఆరంకెల జీతం. ఉద్యోగ జీవితంలో క్లిష్టమైన సమస్యల్ని మేనేజ్ చేసిన నైపుణ్యం. 12 ఏళ్ల క్రితం తండ్రి చనిపోయారు. తల్లి, సోదరుడి అండతో ఏ చీకూచింత లేని జీవితం. రూ.కోట్లలో బంగారం, కట్నం ఇచ్చి మరీ నగరంలోని ఓ చార్టర్డ్ అకౌంటెంట్‌తో ఈ ఏడాది ఫిబ్రవరిలో పెళ్లి చేశారు. ఈ 8 మాసాల్లో ఏం జరిగిందో.. ఎంత క్షోభ అనుభవించిందో.. ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి, సోదరుడు మాత్రం ఇది ఆత్మహత్య కాదని, అత్తింటివారే హత్య చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.**

- భర్త, అత్తమామలే హత్య చేశారని ఫిర్యాదు
- మృతురాలి మామ.. ఎమ్మెల్యే గంటా వద్ద ఆడిటర్
- భర్త, మామలను అదుపులోకి తీసుకున్న పోలీసులు


సత్యప్రియ (ఫైల్)


భర్త కార్తికేయ

**సీతమ్మధార:** నగరంలోని బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కు చెందిన సత్యప్రియ(31) ఆత్మహత్య అనుమానాలకు తావిస్తోంది. మృతురాలి తల్లి, సోదరుడు ఇది ముమ్మాటికీ అత్తింటి వారు చేసిన హత్యేనని ఆరోపిస్తున్నారు. ద్వారకా స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలు.

సత్యప్రియ కుటుంబం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. తండ్రి 12 ఏళ్ల క్రితం మరణించారు. అన్నయ్య అడబాల రామకృష్ణ హైదరాబాద్‌లో ఎస్ఎంఆర్ ఫౌండేషన్ హెడ్. వీరి సొంతూరు రాజమండ్రి. సత్యప్రియ బెంగళూరులోని డిలైట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసేది. తర్వాత హైదరాబాద్‌కు మారింది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న నగరంలోని బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కి చెందిన ఎల్లిశెట్టి కార్తికేయ(32)తో హైదరాబాద్‌లో ఘనంగా వివాహం జరిగింది. కార్తికేయ విశాఖలో చార్టర్డ్ అకౌంటెంట్. ఇతని తండ్రి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వద్ద ఆడిటర్‌గా పనిచేస్తున్నారు. పెళ్లయ్యాక బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని కృపా నిలయంలో ఉంటున్నారు. ఈ నెల 5న వీరు అరకు వెళ్లారు. సత్యప్రియ అక్కడి నుంచి తల్లి శ్రీవెంకటరమణకు వీడియోకాల్ చేసింది. ఐ మిస్ యూ అని చెప్పడంతో తల్లి కంగారు పడింది. వెంటనే ఫోన్ కాల్ చేసి మాట్లాడింది. కానీ, కుమార్తె ఏమీ లేదని చెప్పిందట. బుధవారం భార్యాభర్తలు ఇంటికి వచ్చేశారు.

గురువారం ఉదయం కార్తికేయ యథావిధిగా ఆఫీసుకి వెళ్లిపోయాడు. ఆమె మళ్లీ తల్లికి ఫోన్ చేసి తన బాధ వెల్లబోసుకుంది. సత్యప్రియ పిన్ని కుమార్తెకు వివాహం కుదిరిందని తల్లి చెప్పగా, చెల్లికి బాగా విచారణ చేశాకే మంచి సంబంధం ఖాయం చేయండని సలహా ఇచ్చింది. గురువారం భర్తకి వాట్సప్‌లో కార్టూన్ బొమ్మ పంపించి, మధ్యాహ్నం 12.30 సమయంలో ఫోన్ చేయగా అతను లిఫ్ట్ చేయలేదు. తిరిగి 2.30కు కాల్ చేయగా ఆమె నుంచి బదులు రాలేదు. సాయంత్రం ఇంటికొచ్చి చూసేసరికి పడక గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని సత్యప్రియ కనిపించింది. వెంటనే తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. వారు హుటాహుటిన ఇంటికి చేరుకున్నారు. కోడలు చనిపోయి ఉండటాన్ని చూసిన అత్త స్పృహ తప్పి పడిపోయింది. దీంతో ఆమెను ఎస్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో చేర్పించారు. కుమార్తె ఆత్మహత్య విషయమై అత్తింటివారు కాకుండా వేరే వ్యక్తి ఆమె తల్లికి ఫోన్ చేయడం గమనార్హం. గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో సత్యప్రియ మామ సూర్యచంద్రరావు కోడలి తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. పోలీసులకు రాత్రి 10.20 కు ఫిర్యాదు చేయడం విశేషం. మృతదేహాన్ని కేజీహెచ్‌కి తరలించారు. పోస్టుమార్టం శనివారం చేస్తారని సమాచారం.

విమానంలో హైదరాబాద్ నుంచి రాజమండ్రి వచ్చి, అక్కడి నుంచి కారులో శుక్రవారం ఉదయం తల్లి, సోదరుడు విశాఖ చేరుకున్నారు. ద్వారకా స్టేషన్‌లో తమ కుమార్తెది ఆత్మహత్య కాదని, అత్తింటి వారే హత్య చేశారని తల్లి ఫిర్యాదు చేశారు. వివాహ సమయంలో రూ.4.5 కోట్ల విలువైన బంగారం, కట్నం ఇచ్చామని, పెళ్లికి మరో రూ.కోటి ఖర్చయిందన్నారు. తన కుమార్తె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, మొదటి నుంచి అల్లుడు తల్లిదండ్రుల మాటలు విని, తన కుమార్తెను అనుమానంతో వేధించేవాడని పేర్కొన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త కార్తికేయ, మామ సూర్యచంద్రరావులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఏసీపీ రాంబాబు పర్యవేక్షణలో ద్వారకా స్టేషన్ సీఐ బీవీ రమణ మృతురాలి భర్త, అత్త, మామలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## అర్మాన్ మాలిక్ మ్యూజికల్ నైట్ నేడు


మీడియాతో మాట్లాడుతున్న అర్మాన్ మాలిక్

**ఎంవీపీకాలనీ:** 'అర్మాన్ మాలిక్ లైవ్ ఇన్ వైజాగ్' పేరిట రుషికొండ రాడిసన్ బ్లూ హోటల్‌లో శనివారం సాయంత్రం 6 గంటలకు మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నట్లు ప్రముఖ గాయకుడు అర్మాన్ మాలిక్ తెలిపారు. ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు ప్రేక్షకులంటే తనకెంతో ఇష్టమన్నారు. తన అమ్మమ్మ వాళ్లది విశాఖేనన్నారు. అందుకే విశాఖలో ప్రదర్శన ఇవ్వడం భావోద్వేగాన్ని కలిగిస్తోందన్నారు. తెలుగులో అల వైకుంఠపురంలో పాడిన బుట్టబొమ్మా బుట్టబొమ్మా పాట తన జీవితంలో మరిచిపోలేనన్నారు. తెలుగులో అత్యంత అభిమానించే నటుడు అల్లు అర్జున్ అన్నారు. విశాఖలో షో నిర్వహించడం ఆనందంగా ఉందని, ఇప్పటి వరకు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, బెంగాళీ భాషల్లో 350 వరకు పాటలు పాడినట్లు తెలిపారు. తెలుగులో 40 పాటలు పాడానన్నారు. ఆయనతోపాటు ఈవెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.



## వైజాగ్ ఫుట్‌బాల్‌కు తీరని నష్టం

**విశాఖ స్పోర్ట్స్:** ఐ లీగ్ ఫుట్‌బాల్ క్లబ్ వైజాగ్ సిటీ పేరు మీద ఆడేందుకు శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ లైసెన్స్ తెచ్చుకుని హైదరాబాద్‌కు తరలిపోవడంతో వైజాగ్ ఫుట్‌బాల్‌కు తీరని నష్టం జరిగిందని వాల్తేర్ ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. వైజాగ్ సిటీ ఫుట్‌బాల్ భవిష్యత్తు బాగుండాలంటే అనధికార ఫుట్‌బాల్ సంఘాన్ని రద్దు చేయాలని కోరారు. 2022, 2023లో ఏపీ ఫుట్‌బాల్ సంఘ సహకారంతో మూడు అంతర్ జిల్లాల టోర్నీలు విశాఖలోనే నిర్వహించి, రాష్ట్ర, జాతీయ జట్లలో ఆడే అవకాశం కల్పించామన్నారు.



## హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ జైలు

**విశాఖ లీగల్:** ఒక వ్యక్తిని అతి కిరాతకంగా హత్య చేసిన ముగ్గురికి యావజ్జీవ జైలు శిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.60 వేలు చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ శుక్రవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా ఏడాది పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తన తీర్పులో పేర్కొన్నారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలివీ..అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం మంప పోలీస్ స్టేషన్ పరిధిలోని బోదరాపల్లికి చెందిన గిడుతూరి సింహాచలం, కొర్ల బొజ్జయ్య, సుద్దుల గడ్డ ప్రాంతానికి చెందిన గేమిలి రాంబాబు, కొర్ల బుజ్జి, గమ్మిలి శ్రీను మధ్య భూతగాదాలున్నాయి. ఈ నేపథ్యంలో 2010 మార్చి 13న రాంబాబు మరో ఇద్దరు కలిసి గునపాలు, కత్తులు, పారలు, కర్రలు తదితర మారణాయుధాలతో సింహాచలం, బొజ్జయ్యలపై దాడి చేశారు. సింహాచలం మరణించగా, బొజ్జయ్య గాయపడ్డాడు. వీఆర్వో ఫిర్యాదు మేరకు మంప పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. రెండవ నిందితుడు గమిలి శ్రీనుకి అదనంగా రూ.30 వేలు జరిమానా విధించారు.

## కిలేడీపై నిర్బంధం, హత్యాయత్నం కేసు

**ఎంవీపీకాలనీ:** ఓ వ్యక్తిని నిర్బంధించి, హత్యాయత్నానికి పాల్పడిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎంవీపీ పోలీసులు తెలిపారు. ఫిర్యాదుదారుడు 2019లో ఉద్యోగం నిమిత్తం విశాఖ వచ్చాడు. ఆ సమయంలో అతను పనిచేసే ఆఫీసులో కిలేడీ కె.జాయ్‌జమీమా పరిచయమైంది. తర్వాత ఆమె తన స్నేహితుడైన వేణురెడ్డిని పరిచయం చేసింది. జామియా, వేణురెడ్డిలు ఫిర్యాదీ నుంచి రెండు సెల్‌ఫోన్లు దొంగిలించారు. దీంతో పాటు బుల్లయ్య కళాశాల వెనుక ఓ అద్దె ఇంట్లో అతడిని బంధించి మత్తు పదార్థాలు తీసుకోవాలని ఒత్తిడి చేశారు. డబ్బుల కోసం హింసించడంతో పాటు, గొంతు నులిమి చంపేందుకు కూడా జామీ యా ప్రయత్నించింది. నిందితులిద్దరూ బాధితుడి నుంచి రూ.2 లక్షల వరకు నగదు కాజేశారు. బాధితుడు నగర పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. జామీయాపై ఇప్పటికే నమ్మించి మోసం చేసి, డబ్బులు కాజేసిన కేసులు ఉన్నాయి. తాజా వ్యవహారంలో జామియా, వేణురెడ్డిపై హత్యాయత్నం, నిర్బంధం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వేణురెడ్డితోపాటు, వారికి సహకరించిన వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయన్నారు.

## మనీలాండరింగ్ కేసు పేరిట రూ.16.5 లక్షలు కాజేత

**విశాఖ సిటీ:** మనీలాండరింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని బెదిరించి నగరానికి చెందిన ఒక వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.16.5 లక్షలు కాజేశారు. నగదు లావాదేవీల ఆధారంగా సైబర్ క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేయగా.. నెల్లూరుకు చెందిన నలుగురు కమీషన్ కోసం కక్కుర్తి పడి తమ బ్యాంక్ అకౌంట్లను సైబర్ నేరగాళ్లకు విక్రయించినట్లు గుర్తించారు. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లి వారిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపించారు. వివరాలివీ.. నగరానికి చెందిన ఒక వ్యక్తికి 7063014894 నుంచి ఫోన్ వచ్చింది. ఎస్‌బీఐకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో చిక్కుకున్నావని, దర్యాప్తు చేయాలన్నారు. సుప్రీంకోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసిందని, విచారణ కోసం హైదరాబాద్‌కు రావాలన్నారు. ఇందుకు ఓ హోటల్ గదిలో ఒంటరిగా ఉండాలనీ, 72 నుంచి 80 గంటల పాటు కెమెరా ముందు కూర్చోవాలని, ఈ విషయాన్ని ఎవరికీ చెప్పకూడదన్నారు. ఇన్వెస్టిగేషన్‌కు సహకరించాలని, లేకుంటే కుటుంబ సభ్యులను కూడా అరెస్టు చేస్తామని బెదిరించారు. దీంతో ఆ వ్యక్తి భయభ్రాంతులకు గురై ఫోన్‌లో చెప్పినట్లుగా వెళ్లి వారు ఇచ్చిన ఖాతాకేఉ రూ.16.5 లక్షలు బదిలీ చేశాడు. వెంటనే ఫోన్ కట్ అయింది. తర్వాత బాధితుడు మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించి సాంకేతికత సహాయంతో బ్యాంక్ లావాదేవీలు జరిగిన అకౌంట్లను గుర్తించారు. అవి నెల్లూరుకు చెందిన నలుగురివిగా తెలుసుకుని అక్కడకు వెళ్లి అరెస్టు చేశారు. వారిపై ఏపీతో పాటు జమ్మూ కశ్మీర్, కేరళ, హర్యా నా, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్, చండీగర్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్‌లో 69 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు.